క్లుప్తంగా

మావుళ్లమ్మ అమ్మవారికి బంగారం సమర్పణ



అమ్మవారికి బంగారం సమర్పిస్తున్న ముదునూరి కైలాష్ వర్మ

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారికి మంగళవారం భీమవరానికి చెందిన ముదునూరి కైలాష్ వర్మ 8 గ్రాముల బంగారం సమర్పించారు. అలాగే అమ్మవారికి దర్శించుకుని పూజలు నిర్వహించారు. వారికి ఉప ప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు..

సచివాలయం ప్రారంభం

పాలకోడేరు: మండలంలోని మోగల్లులో ఉండి ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు మంగళవారం గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. అలాగే గంగాదేవి గుడి వద్ద నిర్మించిన సీసీ రోడ్డు, ఆర్ అండ్‌బీ రోడ్డు నుంచి అల్లూరి సీతారామరాజు మెమోరియల్ బిల్డింగ్ వరకు నిర్మించిన సీసీ రోడ్డును, పబ్లిక్ హెల్త్ సెంటర్ ను ప్రారంభించారు. అనంతరం గుత్తులవారిపాలెంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు, వాటర్ ట్యాంక్ ను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లిపూడి కృష్ణకుమారి, శ్రీనివాస్, కొత్తపల్లి నాగరాజు పాల్గొన్నారు.

సచివాలయ బదిలీలు పారదర్శకంగా చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

ఉండి: సచివాలయాల్లో ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా జరగాలని (ఏపీజీఈఏ) ఉద్యోగసంఘ నాయకులు తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీఓ శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో స్థానిక(నేటివ్) మండలంలో బదిలీలకు ఆప్షన్ కల్పించాలని కోరారు. రేషనలైజేషన్ పారదర్శకంగా అమలు చేయాలని మిగుల సిబ్బందికి సంబంధించి స్పష్టమైన విధివిధానాలు జారీ చేయాలని కోరారు.

పేదలకు సహాయం అందించడం అభినందనీయం



భీమవరంలో పేదలకు అన్నదానం చేస్తున్న దృశ్యం

భీమవరం: పుట్టినరోజులు, పెళ్లి రోజు వేడుకలను బంధువులు, స్నేహితులతోనూ నిర్వహించుకోవడంకంటే సమాజంలోని అభాగ్యుల మధ్య నిర్వహించుకునే వారికి సహాయం అందించడం అభినందనీయమని భీమవరం ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పస్తుల రామకృష్ణ అన్నారు. భీమవరం పట్టణానికి చెందిన భూపతి రాజు వెంకటనారాయణరాజు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం గొల్లవానితిప్ప రోడ్‌లోని ప్రకాష్‌నగర్ కాలనీలో పేదలకు భోజనాలు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, చాన్ భాషా, మండపాక వరప్రసాద్, అమనాపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏలోని రీప్లేస్‌మెంట్ ప్రావిజనల్ సీనియార్టీ లిస్ట్ ప్రదర్శన

భీమవరం: సమగ్రశిక్ష ప్రాజెక్ట్‌లోని కాంట్రాక్ట్ సిబ్బంది రీప్లేస్‌మెంట్ ప్రావిజనల్ సీనియార్టీ లిస్ట్ జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, జిల్లా విద్యాశాఖాధికారి నోటీసు బోర్డులో ప్రదర్శించినట్లు సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి శ్యామ్‌సుందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియార్టీ లిస్ట్‌పై ఎమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 27వ తేది లోపుగా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కార్యాలయంలో అందజేయాలని శ్యామ్ సుందర్ తెలిపారు.

రేపు పెనుగొండలో జాబ్‌మేళా

పెనుగొండ: స్థానిక విశ్వతేజ డిగ్రీ కళాశాలలో 1ఎం1బీ సమన్వయంతో గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు 1ఎం1బీ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ జాన్‌తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ యువతలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, పర్యావరణ పరిరక్షణ, సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా ఫౌండేషన్ కృషి చేస్తుందని వివరించారు. దీనిలో భాగంగా ఉద్యోగ మేళాలో 12 ప్రముఖ కంపెనీలు 400లకు పైగా ఉద్యోగాలు లభించనున్నాయన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లమో, డి-ఫార్మసీ, బి-ఫార్మసీ, ఎం-ఫార్మసీ, ఏదైనా డిగ్రీ అర్హత ఉన్నవారు మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా బయోడేటా, అర్హత సర్టిఫికెట్లు, జిరాక్స్‌లు తీసుకురావాలన్నారు. మిగిలిన వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

వీఆర్ఏల వేతన యాతన

కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా జీతాలు పెంచలేదని ఆవేదన



ఉండిలో ఆవేదన తెలుపుతున్న వీఆర్ఏలు

ఉండి: కూటమి ప్రభుత్వం ఏడాదైనా తమ వేతన విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవడం వీఆర్ఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాల్సి ఉన్నా ఇప్పటి దాకా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రెవెన్యూ శాఖ ద్వారా రాష్ట్రం లేదా కేంద్ర ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా గ్రామస్థాయిలో అది విజయవంతం కావాలంటే దానికి విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్‌ల కీలకంగా ఉంటారు. జిల్లా కలెక్టర్ నుంచి గ్రామస్థాయి వీఆర్వో వరకు ఏ పని జరగాలన్నా దానికి కావాల్సింది వీఆర్ఏలే. రాత్రీ,పగలు తేడా లేకుండా ఎప్పుడు బడితే అప్పుడు డ్యూటీలు వేస్తే మారు మాట్లాడకుండా ఎంత దూరాభారమైనా వెళ్ళి రావల్సిందే తప్ప ఇదేంటి అని అడిగే అధికారం ఉండదని వీఆర్ఏలు వాపోతున్నారు. టైం జాబ్‌గా ప్రారంభమై ఇప్పుడు సమయమే లేని ఉద్యోగంగా తయారైంది. ఎప్పుడు పిలిచినా రావాలి, ఏం చెప్పినా చేయాలనే చందాన అధికారులు వ్యవహరిస్తున్నారని వివరిస్తున్నారు. రోజుకు రూ.370 భత్యంతో నెలకు రూ.10,000 నుంచి రూ.11085 జీతంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. పేస్కేల్ అమలు చేసి ప్రతీ నెల రూ.18000 జీతం ఇవ్వాలని ఎన్నిసార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

సిబ్బంది తక్కువ పని ఎక్కువ

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వీఆర్ఏల కొరత తీవ్రంగా ఉంది. మండలానికి కనీసం 40 మంది మంది వీఆర్ఏలు ఉండాల్సి వుండగా కేవలం 13 నుంచి 35 మంది వరకు మాత్రమే వీఆర్ఏలు ఉన్నారు. మండల వ్యాప్తంగా రీ-సర్వే, రేషన్‌కార్డుల సర్వే, రెవెన్యూ కార్యక్రమాలు ఇతరమైన ఏ పనులు ఉన్నా వీరితోనే చేయించయడంతో తీవ్ర పని ఒత్తిడికి లోనవుతున్నారు. తమ పని తాము చేసుకోవమే చాలా కష్టంగా ఉందని ఇప్పుడు రీసర్వే పేరుతో ఇతర గ్రామాలకు కూడా పంపించి పని చేయిస్తున్నారని దానివల్ల మాకు కనీస ప్రతిఫలం లేదని వారు వాపోతున్నారు.

మంత్రి లోకేష్‌కు వినతిపత్రం ఇచ్చినా

ఈ ఏడాది ప్రథమార్థంలో ఉండి జెడ్పీ హైస్కూల్‌కు విచ్చేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వీఆర్ఏల సంఘ ప్రతినిధులు తమ బాధలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసినట్లు చెబుతున్నారు. అయితే దానిపై ఇప్పటి వరకు ఎటువంటి స్పందన లేకపోవడంతో వీఆర్ఏలు తీవ్ర ఆసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపు వీఆర్ఏలకు న్యాయం చేస్తామని ఆనాటి కూటమి నాయకుల వాగ్దానాలు నమ్మి మోసపోయామని వారు ఆవేదని చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీతాలు పెంచాలని కోరుతున్నారు.

వివరాలు

మండలం	గ్రామాలు	ఉండాల్సిన వీఆర్ఏలు	ఇప్పుడు నివేస్తున్న సంఖ్య
ఉండి	19	50	35
ఆకివీడు	16	72	13
కాళ్ళ	21	50	25

మా బతుకులు ఇంకింతేనా?



తాత, నాన్న,నేను ఇలా ఒకరి తరువాత ఒకరం ఈ ఉద్యోగాన్నే నమ్ముకుని బతుకుతున్నాం. తరాలు మారుతున్నా ఉద్యోగంలో మార్పులేదు. జీతంలో లేడా లేదు. సగటు మనిషి బతకాలంటే ఎంత జీతం కావాలో ప్రభుత్వ పెద్దలకు తెలుసు. దాని ప్రకారం మాకు న్యాయం చేసి మమ్మల్ని ఆదుకోవాలి.

– ఎం నాగరాజు, వీఆర్ఏ, ఉండి

ప్రమోషన్‌లు ఇవ్వాలి



కూటమి ప్రభుత్వంలో మాకు తగిన గుర్తింపు ఇవ్వాలి. వీఆర్ఏలుగా ఎన్నో ఏళ్ల సీనియారిటీ కలిగిన వారిని గుర్తించి ప్రభుత్వం మాకు పదోన్నతులు కల్పించాలి. డీఏలు ఇచ్చి మమ్మల్ని ఆదుకోవాలి. చాలీచాలని జీతంతో కుటుంబం గడవాలంటే కష్టం ఉంది. ఇప్పటికైనా మా జీతాలు పెంచాలి.

– ముత్యాలపల్లి గేణేష్, వీఆర్ఏ, ఎన్నార్పీ అగ్రహారం

పేస్కేల్ అమలు చేయాలి



ఏళ్లకు ఏళ్లుగా గ్రామాలకు సేవలు చేశాం. ప్రభుత్వాలు మారుతున్నా మా తలరాతలు మారడం లేదు. మాకు తగిన గుర్తింపు ఇచ్చి మాకు పేస్కేల్ అమలు చేసి మాకు జీతాలు ఇవ్వాలి. మాకు కనీసం రూ.18000 నెలకు జీతం ఇవ్వాలి. అత్యంత నిరుపేదలుగా మిగిలిపోతున్న మాపై ప్రభుత్వం దయ చూపాలి.

– బి.సుల్తాన్‌బాషా,వీఆర్ఏ, పెదపుల్లేరు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం ఇండస్ట్రియల్ ఏరియాలోని విద్యుత్ ఉపకేంద్రము పరిధిలో కొత్త విద్యుత్ తీగల మార్పిడి నిమిత్తం 25వతేది బుధవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. నరసయ్య అగ్రహారంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కాళ్ల: మండలంలోని బోస్ కాలనీ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ స్కీమ్‌లో భాగంగా నూతన 11 కెవి లైన్ ఏర్పాటు పనులు నిమిత్తం బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకుమంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మాలవానితిప్ప, గోగుతిప్ప, ఆనందపురం, ఇస్కుల్లంక, మేకలదిబ్బ, గూట్లపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఎక్సైజ్ స్టేషన్ వద్ద వాహనాల వేలం

భీమవరం: భీమవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన 3 ద్విచక్ర వాహనాలకు బుధవారం వేలం నిర్వహిస్తామని సీఐ కె.బలరామరాజు తెలిపారు. వివరాలకు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి

భీమవరం అర్బన్: గ్రామంలో తాగునీటిని ఫిల్టర్ చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో మంగళవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో తాగునీరు ఫిల్టర్ చేసి సరఫరా చేయాలని గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో కుళాయి ద్వారా సరఫరా చేసే నీరు బురదగా వస్తున్నాయని తాగడానికి ఏ మాత్రం పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ నీటితో స్నానం చేస్తే దురదలు వస్తున్నాయని వాపోయారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది స్పందించి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మందా మార్తమ్మ, కాటికి సంపతరావు, బొడ్డు ఏసేబురాజు చిలకపాటి బేబీ, కుర్రం లక్ష్మి నరసమ్మ, భూపతి మణి పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

పాలకోడేరు: వీధి కుక్కలు దాడి చేయడంతో ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని తూర్పుపేటలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తొంటా సీతమ్మ, అనిమిరెడ్డి అన్నమ్మ రోడ్డుమీద ఉండగా ఒక్కసారిగా వీధి కుక్కలు వారిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ ఇద్దరిని స్థానికులు చికిత్స నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వీధి కుక్కలు ఆకస్మికంగా దాడి చేయడంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

బీజేపీ చీకటిపాలనకు స్వస్తి చెబితేనే ప్రజాస్వామానికి మంచిరోజులు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి



భీమవరంలో సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో మాట్లాడుతున్న రమాదేవి

భీమవరం: కేంద్రంలో గత 11 ఏళ్లుగా బీజేపీ నేతృత్వంలో సాగుతున్న చీకటి పరిపాలనకు స్వస్తి పలికితేనే ప్రజాస్వామ్యానికి మంచి రోజులు వస్తాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి రమాదేవి అన్నారు. మంగళవారం భీమవరంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో 50 ఏళ్లనాటి ఎమర్జన్సీ నాడు-నేడు అనే అంశంపై ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆమె మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో రమాదేవి మాట్లాడుతూ 50 ఏళ్ల క్రితం ఎమర్జన్సీని ఉపయోగించి అప్పటి ప్రభుత్వం ప్రజల హక్కులను ఏవిధంగా హరించిందో నేడు ఎమర్జన్సీ లేకుండానే బీజేపీ ప్రభుత్వం హక్కులను ఏ విధంగా హరిస్తుందోననే విషయాలు ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడి ప్రభుత్వం అప్రకటిత ఎమర్జన్సీ అమలు చేస్తోందని రమాదేవి ఆందోళన వ్యక్తం చేశారు. నరేంద్రమోదీ పరిపాలన కూలదోస్తేనే ప్రజాస్వామ్యానికి మంచి రోజులు వస్తాయన్నారు. కేంద్రం హిందూత్వ రాజకీయాలను అమలు చేస్తూ ప్రజల మధ్యన చిచ్చుపెడుతోందని విమర్శించారు. మేధావులు, జర్నలిస్టులను అరెస్టులు చేసి జైళ్లలో నిర్బంధించి మీడియా స్వేచ్ఛను హరిస్తోందన్నారు. ప్రభుత్వాలు రాష్ట్రాల్లో నిరుద్యోగం, రైతుల ఆత్మ హత్యలు వంటి సమస్యలు పక్కకునెట్టి ప్రమాదకరమైన జమిలి ఎన్నికలు అంశాన్ని ముందుకు తెస్తున్నాయన్నారు. ఆనాడు ఎమర్జన్సీపై ఏవిధంగా సీపీఎం, వామపక్షాలు, ప్రజాస్వామిక వాదులు పోరాటం సాగించాయో ఈనాడు అదే స్ఫూర్తితో నరేంద్రమోదీ మతోన్మాద రాజకీయాలపై పోరాటం చేయాల్సిన పరిస్థితి ఉందని రమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు పి పూర్ణ, జె సత్యనారాయణ, కె క్రాంతిబాబు, ఎం వైకుంఠరావు, మల్లిపూడి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీకి 50 ఏళ్లు సెమినార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు పాక సత్యనారాయణ

భీమవరం: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీకి 50 ఏళ్లు అనే అంశంపై భీమవరం ఆదిత్య డిగ్రీ కళాశాలలో మంగళవారం సెమినార్ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యవక్తగా హాజరైన రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ఎమర్జెన్సీ రోజులను చీకటి రోజులుగా అభివర్ణించారు. ఒక వ్యక్తి యొక్క నియంతృత్వ పోకడలు, అధికార దాహానికి ఎమర్జెన్సీ ఒక నిదర్శనమన్నారు. నేటి యువతరం చరిత్రని తెలుసుకొని గతంలో జరిగినటువంటి తప్పులను భవిష్యత్తులో జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సత్యనారాయణ చెప్పారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి యాగంటి వెంకట గోపి మాట్లాడుతూ ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు అవుతున్నా అప్పటి పరిస్థితులు తలుచుకుంటే నేటికీ భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ అనురాధ, ు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ వెంకట్, భీమవరం విభాగ్ కన్వీనర్ దిన్నూ చందు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మిద్దాం



భీమవరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

భీమవరం: మాదక ద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మిద్దామంటూ పోలీస్‌ఈగల్ శాఖ , వరల్డ్ హ్యూమన్ రైట్స్ సంస్థ అధ్వర్యంలో భీమవరంలో మంగళవారం ఝాన్సీలక్ష్మీబాయి మున్సిపల్ హైస్కూల్లో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వరల్డ్ హ్యూమన్ రైట్స్ ఏపీ చైర్మన్ పద్రిపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుష్ప్రభావలపై విద్యాసంస్థల్లో తమ సంస్థ తరపున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన సామాజిక, మానసిక, శారీరక సమస్యలు తలెత్తుతాయని అందువల్ల దేశ భవిష్యత్తును కృంగదీసే మాదక ద్రవ్యాలను పకడ్బందీగా అరికట్టాలన్నారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రజా భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఈగల్ శాఖ అడ్వైజర్ చెరుకువాడ రంగసాయి, పోలీస్ కానిస్టేబుల్ మురళీ, ఆర్ఆర్‌డిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కె శ్రీనివాసరావు, అరవింద స్వామి, ఓలేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనే మరమ్మతులు



విస్సాకోడేరు 165 జాతీయ రహదారిలో వర్షంలో మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరు గ్రామంలో165 జాతీయ రహదారి పాడై గోతులమయంగా మారడంతో నిత్యం ఈ రహదారిపై ప్రయాణించే ప్రయాణికులు ప్రమాదాలకు గురవడంతో గతంలో మరమ్మతులకు నోచుకోని రోడ్లు వాహనదారులు విన్నవించుకున్నా అధికారుల్లో గానీ, పాలకులలలో గాని చలనం లేదు. అయితే ఈ రెండు మూడు రోజుల నుంచి వర్షం కురవడంతో రోడ్లు విపరీతంగా ఛిద్రమవ్వడంతో అధికారులు మరమ్మతులు చేపట్టే కార్యక్రమానికి పూనుకున్నారు. విచిత్రం ఏమిటంటే మొన్నటి వరకు భీకరమైన ఎండలు కాసిన సమయంలో మరమ్మతులు చేయడం మానేసి వర్షం పడుతున్నప్పుడు చేస్తుండడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంగా ఉన్న ఈ రోడ్డు మరమ్మతులను వర్షంలో చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విశేషం.

సిల్ట్ తీసిన మట్టి రోడ్డుపైనే

నరసాపురం: పట్టణంలో ప్రధానమైన అల్లూరి కాంప్లెక్స్‌సెంటర్‌లో గత నాలుగురోజుల క్రితం డ్రెయినేజీలో తీసి సిల్ట్‌ను అలాగే వదిలేశారు. అయితే మంగళవారం వర్షం పడడంతో డ్రెయినేజీలో తీసి రోడ్డుమీదే ఉంచేసిన మట్టి తిరిగి డ్రెయినేజీల్లోకే వెళ్లిపోతుంది. అంతేకాకుండా వర్షం కారణంగా రోడ్డుమొత్తం బురదమయంగా మారింది. ప్రధానమైన మార్కెట్ ప్రాంతం కావడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. రోడ్డుపై ప్రయాణించే వారు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

హాస్టళ్లలో కలెక్టర్ తనిఖీలు



ఉండి ఎస్సీ బాలికల హాస్టల్‌లో విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ఉండి: హాస్టల్ విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఉండిలో ఎస్సీ బాలికల హాస్టల్,కళాశాల బాలుర బీసీ హాస్టల్‌ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ నిర్వహణ,విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, భోజనం, అధికారుల తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా పెదపేటలోని ఎస్సీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసి విద్యార్థుల చదువులపై ఆరా తీశారు. అనంతరం ఉండి బీసీ కళాశాల బాలుర హాస్టల్‌ను ఆమె సందర్శించారు. హాస్టల్స్ తనిఖీ అనంతరం ఉండి సంతమార్కెట్‌లో సాధారణ వ్యక్తి కూరగాయాల ధరలు తెలుసుకున్నారు. కూరగాయల విత్తనాలు వ్యాపారి వద్దకు వెళ్లి పెరట్లో నాటేందుకు చిక్కుడు విత్తనాలు కొనుగోలు చేశారు. ఆమె వెంట తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నారుమడులు సిద్ధం చేసుకోవాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్

ఆకివీడు: కాలువల్లోకి పంట నీరు చేరుకుందని, వర్షాలు కురుస్తుండటంతో రైతులు నారుమడులు సిద్ధం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.మధు మోహన్ చెప్పారు. మండలంలోని అజ్జమూరు, చినమిల్లిపాడు గ్రామాల్లో మంగళవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన నాట్లు వేసి, సకాలంలో మాసూళ్లు పూర్తి చేసుకుంటే కోతల సమయంలో తుఫాన్ ప్రభావానికి గురయ్యే అవకాశం ఉండదన్నారు. వెదజల్లు పద్ధతి మంచిదని తెలిపారు. అవకాశం ఉన్న భూముల్లో రైతులు వెదజల్లు పద్ధతి పాటించాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు బిల్లులను తప్పనిసరిగా తీసుకోవాలని, సాగు పూర్తి అయ్యేవరకూ బిల్లులు, ట్యాగ్‌లు భద్రపరచాలని ఏఓ సూచించారు. కార్యక్రమంలో చల్లారావు, లక్ష్మీనారాయణ, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణం పూర్తయ్యేదెప్పుడు?



పెదకాపవరం-క్రొవ్విడి రహదారి దుస్థితి

ఆకివీడు: మండలంలోని పెదకాపవరం గ్రామం నుంచి క్రొవ్విడి, కొల్లేరు వెళ్లే రహదారుల పునర్నిర్మాణానికి గత ప్రభుత్వంలో కేంద్ర రోడ్డు నిధులు(సీఆర్ఎఫ్) సుమారు రూ. 50 కోట్లు మంజూరు అయ్యాయి. రహదారి నిర్మాణ పనులకు రెండేళ్ల క్రితమే భూమి పూజలు చేశారు. పెదకాపవరం నుంచి క్రొవ్విడి వరకూ రోడ్డు కం రిటర్నింగ్ వాల్ నిర్మాణం, పెదకాపవరం నుంచి గంటలరాయుడు పేట వరకూ రోడ్డు విస్తరణ, పునర్నిర్మాణం పనులకు నిధులు మంజూరయ్యాయి. ఏడాది క్రితం పెదకాపవరం-క్రొవ్విడి వరకూ పంట కాల్వకు రిటర్నింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేశారు. అదే విధంగా పెదకాపవరం-గంటలరాయుడు పేట వరకూ రోడ్డు విస్తరణ కోసం ఆక్రమణలను తొలగించారు. రిటర్నింగ్ వాల్ నిర్మాణం పూర్తి అయినప్పటికీ ఇంత వరకూ బిల్లులు చెల్లించలేదని, దీంతో సంబంధిత కాంట్రాక్టర్ డైలమాలో పడ్డారని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

ఎక్కడ పని అక్కడే

ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా ఉండిపోయాయి. ఈ ఏడాది వేసవి కాలంలో పనులు ప్రారంభించేందుకు సిద్ధమైనప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. దీంతో క్రొవ్విడి, బావాయిపాలెం మీదుగా గణపవరం వెళ్లే వాహనాలకు, ప్రజలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఈ రహదారి భారీ గుంతలతో ఉండటం వల్ల వేసవిలో రోడ్డును చదును చేయించారు. అయినప్పటికీ వర్షం వస్తే జారుడుబల్లకంటే దారుణంగా రోడ్డు ఉంటుందని వాహనచోదకులు వాపోతున్నారు. పెదకాపవరం-గంటలరాయుడు పేట రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో గుంతలు గుంతలుగా మారింది. కొల్లేరు తీరంలోని చేపలు, రొయ్యల చెరువులకు మేత తీసుకువెళ్లేందుకు, చేపలు, రొయ్యల లోడుతో లారీల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుందని ఆయా ప్రాంతాల రైతులు, ప్రజలు వాపోతున్నారు. కేంద్ర రోడ్డు ఫండ్ శాఖ అధికారులు స్పందించి నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు. నిధులు విడుదల కాకపోవడం వల్లే పనులు ప్రారంభించలేదని ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీహరిరాజు చెప్పారు. రిటర్నింగ్ వాల్ బిల్లు కూడా విడుదల కాలేదన్నారు. సీఆర్‌ఎఫ్‌నిధులు విడుదల అయిన వెంటనే పనులు ప్రారంభిస్తారని చెప్పారు.

యలమంచిలిలో సచివాలయ ఉద్యోగుల నిరసన

యలమంచిలి: సచివాలయ ఉద్యోగుల బదిలీల జీఓ-5ను సవరించాలని కోరుతూ మంగళవారం సచివాలయ ఉద్యోగులు మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సొంత మండలంలో బదిలీలకు అవకాశం కల్పించాలని, రేషనలైజేషన్ మిగులు సిబ్బంది పై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని, సర్వీస్ రూల్, ప్రమోషన్ చానల్, నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈఓపీఆర్డీ జేడీవీ ప్రసాద్‌కు, తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌కు అందజేశారు. షేక్ ఉమర్ ఆలీషా, జి ప్రసాద్, సీహెచ్ రాజేష్ , పులపర్తి సత్య సునీల్ పాల్గొన్నారు.